
సాక్షి
బాపట్ల

శనివారం ¦ 1 ¦ ఫిబ్రవరి ¦ 2025



నెమలి వాహనంపై భావనారుషి
తెనాలి: షరాఫ్ బజారులోని శ్రీ భద్రావతి సమేత శ్రీభావనాఋషిస్వామి కల్యాణం సందర్భంగా శుక్రవారం రాత్రి స్వామిని నెమలి వాహనంపై ఊరేగించారు.



సాగర్ నీటిమట్టం
విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 552.40 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడి కాలువకు 2,799 క్యూసెక్కులు వదిలారు.



అమ్మవారికి సారె
నగరంపాలెం: గుంటూరు ఆర్.అగ్రహారం శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారం దేవస్థానంలో ఆత్మార్పణ దినోత్సవం ప్రారంభమైంది. అమ్మవారికి సారె తీసుకొచ్చారు.

కాల కూటమి అరాచకాలు

- మంత్రుల నియోజకవర్గాల్లో పెచ్చుమీరిన దాడులు, దౌర్జన్యాలు
- చిరుద్యోగులపై కక్ష సాధింపు
- ఉద్యోగాలు వదలి వెళ్లేందుకు ఉన్నతాధికారుల ద్వారా ఒత్తిళ్లు
- వేధింపులు తాళలేక ప్రాణాలు తీసుకుంటున్న చిరుద్యోగులు
- తాజాగా నగరంలో ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేశ్వరరావు మృతి
- వైఎస్సార్ సీపీ సానుభూతిపరులపై నేరుగా దాడులు, అక్రమ కేసులు
- అద్దంకిలో వైఎస్సార్ సీపీ సానుభూతిపరుడి హత్య
- తాజాగా పేదల పశులపాకలు, గడ్డివాములు,పేడ దిబ్బలు కూల్చివేత
- దశాబ్దాలుగా ఉంటున్న పేదలను రోడ్డున పడేసిన వైనం
- పచ్చ అరాచకంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు



అద్దంకి చిన్నకొత్తపల్లిలో పేదల పశువుల పాకలు, గడ్డివాములు తొలగింపు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, బాపట్ల: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే జిల్లాలో పచ్చ నేతల వేధింపులు శృతిమించాయి. ముఖ్యంగా జిల్లా మంత్రులు గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్‌లకు చెందిన అద్దంకి, రేపల్లె నియోజకవర్గాల్లో దాడులు, హత్యలు, వేధింపులు పెరిగాయి. దశాబ్దాలుగా పని చేస్తున్న చిరుద్యోగులను తొలగించి వారి స్థానంలో తమవారిని నియమించుకునేందుకు పచ్చనేతలు సిద్ధమయ్యారు. ఇందుకోసం ఉన్నవారి ఉద్యోగాలు ఊడబెరకాలంటూ ఉన్నతాధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. దీంతో ఉద్యోగాలు మానివేయాలంటూ అధికారులు చిరుద్యోగులను వెంటాడుతున్నారు. ఉద్యోగం పోగొట్టుకొని బతుకుతెరువు కోల్పోయి రోడ్డున పడలేక కొందరు ఉద్యోగులు న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నారు. దీంతోఆగ్రహం చెందిన ఉన్నతాధికారులు అవినీతి, విచారణ, చర్యలు అంటూ చిరుద్యోగులను వేధింపులకు గురి చేస్తున్నారు. ఇవి భరించలేక గుండె పోటు, ఇతర అనారోగ్యాలకు గురై అసువులుబాస్తున్నారు.

వందలాది మంది తొలగింపు

జిల్లావ్యాప్తంగా వందలాది మంది ఫీల్డ్ అసిస్టెంట్లు, యానిమేటర్లు, డీలర్లు, వలంటీర్లతో పాటు చిరుద్యోగులనందరినీ కూటమి ప్రభుత్వం తొలగించింది. దీంతో వారంతా తీవ్ర ఒత్తిడిలో దిక్కుతోచని స్థితిలో పడ్డారు. కొన్ని కుటుంబాలు ఇప్పటికే రోడ్డున పడ్డాయి. ఆందోళనలు చేసినా ప్రభుత్వం ఖాతరు చేయడంలేదు.

ఫీల్డ్ అసిస్టెంట్ బలి



తాజాగా నగరం మండలం సజ్జావారిపాలేనికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేశ్వరరావు ఉన్నతాధికారి వేధింపుల పుణ్యమాని గురువారం మృతి చెందాడు. ఆయన 17 సంవత్సరాలుగా ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. కూటమి అధికారంలోకి రాగానే ఇదే మండలానికి చెందిన 12 మంది ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించగా వెంకటేశ్వరరావుతోపాటు ఏడుగురు కోర్టును ఆశ్రయించారు. దీన్ని సహించలేని పచ్చనేతలు ఎలాగైనా వారిని తొలగించాలంటూ ఉన్నతాధికారులపై ఒత్తిడి పెంచారు. దీంతో వెంకటేశ్వరరావు పరిధిలో జరిగిన పనుల్లో అక్రమాలంటూ విచారణ పేరుతో ఆయన్ను వేధించారు. మరోవైపు డ్వాక్రా యానిమేటర్ గా ఉన్న వెంకటేశ్వరరావు భార్య నాగమణిని సైతం తొగించడంతో కుటుంబంలో ఇద్దరి ఉద్యోగాలు పోయాయి. ఒత్తిడి భరించలేక వెంకటేశ్వరరావు గుండెపోటుతో మరణించాడు.

గొట్టిపాటి ఇలాకాలో దౌర్జన్యాలు

ఇటీవల అద్దంకి మండలం చిన్నకొత్తపల్లిలో 20 కుటుంబాల వారి పశువుల పాకలు, వామి దొడ్లు, పేడ దిబ్బలు ధ్వంసం చేసి నిరాశ్రయులను చేశారు. దశాబ్దాలుగా గ్రామకంఠం స్థలంలో అక్కడి రైతులు వాటిని వేసుకున్నారు. గత ప్రభుత్వంలో సచివాలయ భవనాల నిర్మాణం కోసం తలో రెండు సెట్లు స్థలమిచ్చారు కూడా. కూటమి అధికారంలోకి వచ్చాక మొత్తం స్థలం ఖాళీ చేసి వెళ్లిపొమ్మని పచ్చనేతలు ఒత్తిడి తేవడంతో అధికారులు మూడు రోజుల కిందట పాకలు, వామిలు, పేడ దిబ్బలు ధ్వంసంచేసి అక్కడున్న వారందరినీ నిరాశ్రయులను చేశారు.

- ఇదే గ్రామంలో డిసెంబర్ 19న వైఎస్సార్ సీపీ సానుభూతి పరుడు చెన్నుపాటి వెంకటేశ్వరరావును పచ్చపార్టీ మద్దతుదారులుగా ఉన్న బంధువులు అత్యంత పాశవికంగా ట్రాక్టరతో తొక్కించి చంపారు. పేరుకు సాగు భూమి తగాదాగా చూపించినా వైఎస్సార్ సీపీకి మద్దతుగా నిలిచాడన్న అక్కసుతోనే చంపినట్లు కుటుంబ సభ్యులు ఆరోపించారు.
- ఇదే మండలం ధర్మరానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత ప్రభాకరరెడ్డి అనుచరులపై దాడులతోపాటు ఆయన ఆస్తులను ధ్వంసం చేయడంతోపాటు వారిపైనే అక్రమ కేసులు పెట్టి వేధించారు.



చిన్నకొత్తపల్లిలో వెంకటేశ్వరరావును హత్య చేసిన టీడీపీ మద్దతుదారులు (ఫైల్)

అనగాని అడ్డాలో దారుణాలు

రేపల్లె నియోజకవర్గంలో కూటమి అధికారంలోకి రాగానే నగరం మండలం దాసరిపాలేనికి చెందిన వైఎస్సార్ సీపీ నేత నున్నా భూషయ్యను దారుణంగా హత్యచేశారు. ఆధిపత్యం కోసమే పచ్చనేతలు ఈ హత్యకు పాల్పడినట్లు ఆరోపణలున్నాయి.

- కూటమి అధికారంలోకి వచ్చాక వేమూరు నియోజకవర్గంలో దాడులు, దౌర్జన్యాలు పెరిగాయి. వందలాది మంది వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలపై దాడులు చేసి ఊర్లు వదిలేలా చేశారు. అక్రమ కేసులు పెట్టారు.
- భట్టిప్రోలు మండలం అద్దేపల్లి దళితవాడలో దివంగత వైఎస్సార్ విగ్రహాన్ని తగులబెట్టారు. నిలదీసిన వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త,రాష్ట్ర అధికార ప్రతినిధి వరికూటి అశోక్‌బాబుపై అక్రమ కేసులు పెట్టారు.
- తాజాగా భట్టిప్రోలు మండలం పల్లెకోనలో వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడన్న కక్షతో శ్రీనివాసరావు 20 ఏళ్లుగా నడుపుకుంటున్న చికెన్ దుకాణాన్ని కూలగొట్టారు.
- పర్చూరు నియోజకవర్గంలో పలువురు వైఎస్సార్‌సీపీ నేతలపై పచ్చనేతలు అక్రమకేసులు పెట్టడంతోపాటు రౌడీషీట్లు తెరిపించి వేధిస్తున్నారు.
- బాపట్ల, చీరాల యోజకవర్గాల్లోనూ కూటమి నేతలు వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు ,చిరుద్యోగులను వెంటాడి వేధిస్తున్నారు.



పల్లెకోనలో శ్రీనివాసరావు చికెన్ దుకాణం కూల్చివేత (ఫైల్)

న్యూస్‌రీల్

వాసవీ అమ్మవారికి ప్రత్యేక పూజలు



రేపల్లె రూరల్: వాసవీ కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా రేపల్లె పట్టణం ఓల్డ్ టౌన్‌లో గల వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామునే అమ్మవారికి సుప్రభాత సేవతో మేళతాళాలు, వేద మంత్రాల నడుమ పండ్ల రసాలు, పంచామృతాలతో ఆలయ అర్చకులు అభిషేకాలు నిర్వహించారు. 102 మంది మహిళలు కలశాలతో పురవీధుల్లో ఊరేగింపుగా తీసుకువచ్చిన జలాలతో అభిషేకం చేశారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి జీవిత చరిత్రను వివరించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ఆవరణలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి 102 రకాల నైవేద్యాలు సమర్పించి, మొక్కుబడులు తీర్చుకున్నారు. లలితా సహస్ర నామ పారాయణ, కనకధారా స్తోత్రాలతో పాటు వాసవీ భక్తి గీతాల ఆలాపన, భజనలు జరిపారు. రాష్ట్ర రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖామాత్యులు అనగాని సత్యప్రసాద్ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేసి, అన్నసంతర్పణ చేశారు. సాయంత్రం అమ్మవారిని పురవీధుల్లో ప్రత్యేక వాహనంలో ఊరేగించారు.

మిర్చి యార్డు కార్యదర్శిగా చంద్రిక బాధ్యతల స్వీకారం



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డు కార్యదర్శిగా ఎ.చంద్రిక శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. యార్డు ఇన్‌చార్జి సుబ్రమణ్యం నుంచి ఆమె బాధ్యతలు స్వీకరించి, మొదటి ఫైల్‌పై సంతకం చేశారు. చంద్రిక కార్యదర్శిగా ఏడాదిపాటు డెప్యుటేషన్ మీద కొనసాగనున్నారు. చంద్రిక మాట్లాడుతూ అంతర్జాతీయస్థాయిలో గుర్తింపు పొందిన గుంటూరు మిర్చి యార్డుకు పనిచేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను విక్రయించుకునేందుకు యార్డుకు వచ్చే మిర్చి రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తానని స్పష్టం చేశారు. అధికారులు, సిబ్బంది సహకారంతో గుంటూరు మిర్చి యార్డును ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తానన్నారు. ప్రస్తుత సీజన్‌లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడతామని ఆమె వివరించారు. పలువురు యార్డు అధికారులు, సిబ్బంది, పలు అసోసియేషన్ల నాయకులు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన చంద్రికను కలిసి పుష్పగుచ్చాలు అందజేసి అభినందనలు తెలియజేశారు.

సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శుక్రవారం 2010 క్యూసెక్కులు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 106, బ్యాంక్ కెనాల్‌కు 130, తూర్పు కెనాల్‌కు 242, పశ్చిమ కెనాల్‌కు 120, నిజాంపట్నం కాలువకు 50, కొమ్మమూరు కాలువకు 930 క్యూసెక్కులు విడుదల చేశారు.

సర్కార్‌పై 'ఫీజు పోరుబాట'కు సిద్ధం



వాల్‌పోస్టర్లును ఆవిష్కరిస్తున్న మేరుగ నాగార్జున, నేతలు

- పార్టీ జిల్లా అధ్యక్షులు మేరుగ నాగార్జున
- ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు వెంటనే విడుదలచేయాలి
- బకాయిలు చెల్లించకపోవడంతో ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

బాపట్ల: కూటమి ప్రభుత్వం విద్యా వ్యవస్థను కూడా సమూలంగా నాశనం చేసేందుకు కంకణం కట్టుకుందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు మేరుగ నాగార్జున ధ్వజమెత్తారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో యాజమాన్యాల నుంచి తీవ్ర ఒత్తిళ్లను విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. విద్యార్థులకు అండగా ఫిబ్రవరి 5న వైఎస్సార్ సీపీ 'ఫీజు పోరుబాట' చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం మొండివైఖరిని విడనాడాలని కోరుతామని చెప్పారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఫీజు పోరు పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. నాడు–నేడు పథకంతో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్యాభివృద్ధికి తొలి ప్రాధాన్యత ఇచ్చారని గుర్తు చేశారు. విద్యార్థులకు అన్ని వసతులతో పాటు ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో చక్కని చదువులు కొనసాగించినట్లు తెలిపారు. నాలుగు త్రైమాసికాలుగా బకాయిలు పెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన ద్వారా రూ.3,900కోట్లు బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సూపర్ సిక్స్‌తో ప్రజలను నమ్మించి ఇప్పుడు 'నిధులులేవు..మేము చేయలేకపోతున్నామ'ని చంద్రబాబు చెప్పడం సిగ్గుచేటని ఖండించారు. విద్యార్థుల పక్షాన అండగా నిలుస్తూ చంద్రబాబు సర్కార్‌పై నిరసన గళం విప్పేందుకు ఈనెల 5న వైఎస్సార్ సీపీ ఫీజు పోరు కార్యక్రమాన్ని చేపట్టిందని మేరుగ నాగార్జున పేర్కొన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి కలెక్టర్ కార్యాలయాలలో వినతి పత్రాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఫీజు పోరులో అందరూ పాల్గొనాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు మరుప్రోలు కొండలరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు కోకి రాఘవరెడ్డి, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు వై.సోహిత్, పార్టీ నాయకులు వడ్డిముక్కల డేవిడ్, చల్లా రామయ్య, కొక్కిలిగడ్డ చెంచయ్య, మోర్ల సముద్రాల గౌడ్, గంగిశెట్టి రత్తయ్య, గొర్రుముచ్చు వెంకటేశ్వర్లు, జోగి రాజా, తన్నీరు అంకమ్మరావు, బడుగు ప్రకాశరావు, కటికల యోహోషువా పాల్గొన్నారు.

'ఉప్పు' బతుకులు దుర్భరం

- కొఠారుల్లో మౌలిక వసతులు కరువు
- కార్మికుల సంక్షేమం పట్టించుకునే నాథుడే లేడు
- నిర్లక్ష్యంగా అధికారులు, భూ యజమానులు
- తీవ్ర అసౌకర్యాల నడుమ కార్మికులు, కూలీలు



ఎండలో ఉప్పు భూమిలో పనులు చేస్తున్న కూలీలు

చినగంజాం: ఉప్పు కొఠారు భూముల్లో కార్మికులు, కూలీల బతుకు నరకప్రాయంగా మారింది. తీవ్ర అసౌకర్యాల నడుమ పని చేయడానికి భయపడుతున్నారు. పూర్తిగా ప్రకృతి ఒడిలో పండించే ఉప్పు సాగుకు వేలాది కార్మికులు ఎండనక, వాననక ఉదయం నుంచి సాయంత్రం వరకు పని చేయాలి. వ్యవసాయం మాదిరిగా పూర్తిగా భూమి, నీరు, సూర్యరశ్మి మీద ఆధారపడి పండించే పంట అయినప్పటికీ ఉప్పు సాగును పరిశ్రమగానే కేంద్ర ప్రభుత్వం గుర్తిస్తుంది. అయితే, వసతులు కల్పనలో అధికారులు, భూ యజమానులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు.

బానిస బతుకులు

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో కొఠారు భూముల్లో తీవ్ర అసౌకర్యాలు నెలకొన్నాయి. బాపట్ల జిల్లాలో ఉప్పు సాగు చినగంజాం మండలంలో మాత్రమే చేస్తారు. భూములకు వెళ్లేందుకు రోడ్లు, కార్మికులకు తాగేందుకు నీరు, విశ్రాంతి భవనాలు, మరుగు దొడ్లు, కార్మికులకు అవసరమైన కళ్లజోళ్లు, బూట్లు, హెల్త్ కార్డులు, పీఎఫ్, ఈఎస్ఐ వంటి పథకాలు అందుబాటులో లేవు. దాంతో కార్మికులు, ముఖ్యంగా మహిళా కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కార్మిక చట్టాలు అమలవుతున్న ప్రస్తుత తరుణంలోనూ ఉప్పు కార్మికులు బానిస బతుకులు కొనసాగిస్తున్నారు.

అవస్థలు వర్ణనాతీతం

కొఠారు భూముల్లో ఉప్పు ఉత్పత్తికి వేసవి కాలం ప్రధానం. ఆ సమయంలో కూలీలు అవస్థలు వర్ణనాతీతం. కాస్తంత దప్పిక తీర్చుకునేందుకు తాగునీటి కోసం గ్రామంలోకి రావాల్సిందే. నిలువ నీడ కూడా కరువవుతోంది. విశ్రాంతి షెడ్డులు కూడా లేవు. వర్షాకాలం వస్తే రోడ్లపై గుంతలలో నీరు నిలిచి నడిచి వెళ్లేందుకు కూడా అవకాశం లేదు. కొఠారు భూముల్లో పనిచేసే కార్మికుల సంక్షేమం, సౌకర్యాల కల్పనకు 70 శాతం నిధులు కేంద్ర ప్రభుత్వం, 30 శాతం నిధులను సాగు చేస్తున్న భూ యజమానులు భరాయించాల్సి ఉంది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం ఉప్పుసాగు చేసే భూ యజమానులకు, లీజుదారుకు లీజ సమయంలో ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ అమలు కావడం లేదు. కొఠారు భూములలో ఉప్పులోడు చేసేందుకు వచ్చే వాహనాలతో రోడ్లు అధ్వానంగా మారినా వాటి బాగోగులు గురించి పట్టించుకొనే పరిస్థితి లేదు. రోడ్లు, చిల్లచెట్ల తొలగింపు వంటి పనులను సాగుదారులే చూసుకోవాలని ప్రభుత్వం సూచించినా ఫలితం లేదు. పిల్లిమెడలో గంట ఎవరు కట్టాలి అనే సామెత మాదిరిగా అటు ప్రభుత్వం, ఇటు లీజుదారులు కొఠారుల్లో సౌకర్యాల ఏర్పాటుకు ముందుకు రాకపోవడంతో కూలీలు అవస్థలు పడుతున్నారు.



చిల్లచెట్లు పెరిగి మూసుకుపోయిన కొఠారు రోడ్డు

బాపట్ల జిల్లాలో చినగంజాం మండలంలో మొత్తం మూడు వేల ఎకరాల్లో ఉప్పు సాగు జరుగుతోంది. రూ. కోట్లలో ఆదాయం ఒనగూరుతోంది. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని సౌత్ సాల్ట్ ఫ్యాక్టరీ పరిధిలో 1300 ఎకరాలు, నార్త్ సాల్ట్ ఫ్యాక్టరీ పరిధిలో మరో 700 ఎకరాలు భూములకు సంబంధించి ఉప్పుశాఖ నిర్వహణ బాధ్యతలు నిర్వహిస్తోంది. మిగతా రైతులు సాగు చేసుకుంటున్నారు. రైతులు ఉప్పు బస్తాకు రూ.32 చెల్లించాలి. అయితే , ఎకరంలో ఉత్పత్తి అయ్యే 400 బస్తాలకుగాను ప్రస్తుతం 200 మాత్రమే కేంద్ర ప్రభుత్వానికి పన్ను రూపంలో చెల్లిస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా పన్ను పూర్తిస్థాయిలో పన్ను చెల్లించలేకపోతున్నారు. ఉప్పుశాఖ ఆధీనంలోని భూములలో సుమారు 1,500 కుటుంబాలకు చెందిన సుమారు 6 వేల మంది కార్మికులు పనులు చేస్తున్నారు. ప్రైవేటు వ్యక్తుల భూముల్లోనూ తీవ్ర అసౌకర్యాలు ఎదురవుతున్నాయి.

మూడు వేల ఎకరాల్లో ఉప్పు సాగు

పనులకు వెళ్లాలంటేనే భయమేస్తోంది



కొఠారులలో పని చేయాలంటేనే భయమేస్తోంది. ఉప్పులోడు చేయటానికి వెళ్లేటప్పుడు రోడ్లు సరిగా లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. కొఠారుల్లోకి వెళితే గాయాలపాలై వస్తున్నాం. తరతరాలు ఇదే విధంగా కొఠారు భూములలో అసౌకర్యాలతో అల్లాడిపోతున్నాం. రోడ్లు, తాగునీరు, మరుగు దొడ్లు, విశ్రాంతి భవనాలు లేవు. లోడు చేసేందుకు వాహనాలలో వెళ్లేటప్పుడు చిల్లచెట్లు కళ్లకు గీసుకుంటున్నాయి.

– కందుల విజయబాబు, కార్మికుడు.

ఎర్రటి ఎండలో అవస్థలు




ఎర్రటి ఎండలో పని చేయలేక ఇబ్బందులు పడుతున్నాం. విశ్రాంతి తీసుకునేందుకు భవనాలు, తాగేందుకు నీరు, మరుగు దొడ్లు సౌకర్యం లేక పోవడంతో కొఠారు పనులకు వెళ్లాలంటే కష్టంగా ఉంటోంది. కనీస సౌకర్యాలు లేక తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నాం.

– డీ తిరుపతమ్మ, మహిళా కార్మికురాలు, రాజుబంగారుపాలెం

- మున్సిపల్ కౌన్సిల్ సభను అవమానించిన ప్రజాప్రతినిధి
- టీడీపీ కౌన్సిలర్ సత్యానందం క్షమాపణ చెప్పాలని వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ల డిమాండ్
- మూడు నెలలు సస్పెండ్ చేసిన ఛైర్మన్
- వాడీవేడిగా మున్సిపల్ సమావేశం

అదే తీరు.. అదే నోటి దురుసు



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ ఛైర్మన్ జైసన్‌బాబు

చీరాల: మున్సిపల్ ఛైర్మన్‌ను, కుర్చీని అవమానపరచిన టీడీపీ కౌన్సిలర్ ఎస్.సత్యానందం సభలో క్షమాపణ చెప్పాలంటూ వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని హాలులో శుక్రవారం కౌన్సిల్ సాధారణ సమావేశం ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశం ప్రారంభం కాగానే ఆయన్ను, ఛైర్మన్ సీటును 31వ వార్డు కౌన్సిలర్ సత్యానందం ఉద్దేశపూర్వకంగా అవమానించారని, సభకు ఆయన క్షమాపణ చెప్పాలంటూ వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్ సీపీ, టీడీపీ కౌన్సిలర్ల మధ్య కొద్దిపాటి వాగ్వాదం చోటుచేసుకుంది. అయితే తాను సభను, ఛైర్మన్‌ను అవమానపరచలేదని, అయినా ఎవరికైనా ఇబ్బంది కలిగితే ఆ మాటలు వెనక్కి తీసుకుంటానని స్పష్టం చేశారు. అయితే, క్షమాపణలు చెప్పాలని వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. ఈ తరుణంలో టీడీపీ కౌన్సిలర్ సత్యానందాన్ని మూడు నెలల పాటు సస్పెండ్ చేస్తున్నట్లు ఛైర్మన్ ప్రకటించారు.

ఎమ్మెల్యే హాజరుతో హైడ్రామా

అదే సమయానికి ఎక్స్ అఫీషియో మెంబర్ హోదాలో ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య మున్సిపల్ సమావేశానికి హాజరయ్యారు. దీంతో కొంత సేపు హైడ్రామా నడిచింది. టీడీపీ కౌన్సిలర్ సత్యానందాన్ని సస్పెండ్ చేసిన విషయం తెలుసుకున్న ఆయన ఈ విషయాన్ని మరోసారి పరిశీలించాలని ఛైర్మన్‌కు సూచించారు. మిగిలిన కౌన్సిలర్లుతో మాట్లాడి చెప్తానని.. సభను పది నిమిషాల పాటు వాయిదా వేశారు. అనంతరం ప్రారంభమైన సభలో కౌన్సిలర్‌ను మూడు నెలల పాటు సస్పెండ్ చేస్తున్నట్లు చెప్పి ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు వెళ్లిపోయారు.

ఐదేళ్లలో రెండుసార్లు సస్పెన్షన్ వేటు

ఛైర్మన్ హోదాలో ఉన్న వ్యక్తి ఏ పార్టీకి సంబంధించిన వ్యక్తి అయినా ఛైర్మన్ పదవికి గౌరవం ఇవ్వాలి. అలా కాకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారంటూ అగౌరవపరచేలా ఛైర్మన్‌ను, ఆ కుర్చీని కించపరిచేలా టీడీపీ కౌన్సిలర్ సత్యానందం వ్యవహరించారు. 2022 ఏప్రిల్ నెలలో జరిగిన కౌన్సిల్ సమావేశంలోనూ ఛైర్మన్ పోడియం వద్దకు వెళ్లి సభకు ఆటంకపరచేలా మాట్లాడినందుకు ఆయనతో పాటు మరో కౌన్సిలర్‌ను మూడు నెలల పాటు సస్పెండ్ చేశారు. మరలా శుక్రవారం జరిగిన సభలో కూడా ఛైర్మన్ అగౌరవపరచేలా మాట్లాడినందుకు గాను మూడు నెలల పాటు సస్పెండ్ చేశారు. ఐదేళ్ల పదవీకాలంలో సత్యానందం రెండు సార్లు సస్పెండ్ కావడం విశేషం.

దూరవిద్య బీఎల్ఐఎస్సీ ఫలితాలు విడుదల

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ దూర విద్యా కేంద్రం గత అక్టోబర్, నవంబర్ నెలలో నిర్వహించిన బ్యాచిలర్ ఆఫ్ లైబ్రరీ సైన్స్ (బీఎల్ఐఎస్సీ) కోర్సు మొదటి, రెండో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను శుక్రవారం దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వి.వెంకటేశ్వర్లు, పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య డి.రామచంద్రన్‌లు విడుదల చేశారు. ఫలితాలను దూరవిద్య కేంద్రం వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏఎన్‌యూసీడీఈ.ఇన్ఫో నుంచి పొందవచ్చునని వారు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ కృష్ణవేణి, కోదండపాణి, ఉద్యోగులు టంకశాల వెంకటేశ్వర్లు, ఎల్ ఎస్.రాంబాబు, కంప్యూటర్ సెక్షన్ నిర్వాహకులు వలి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కిక్కిరిసిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం



చీరాల: భూములు, స్థలాల రిజిస్ట్రేషన్ చార్జీలు, మార్కెట్ విలువ, స్టాంప్ డ్యూటీలు శనివారం నుంచి పెరుగుతున్న నేపథ్యంలో శుక్రవారం చీరాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి భూముల రిజిస్ట్రేషన్ల కోసం ప్రజలు భారీగా క్యూ కట్టారు. సగటున రోజుకు 50 వరకు రిజిస్ట్రేషన్లు చేసే చీరాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పాత రిజిస్ట్రేషన్ ఫీజులు నిలిచిపోయాయి. పెంచిన కొత్త చార్జీలు అమల్లోకి వస్తుండటంతో వివిధ ప్రాంతాలకు చెందిన కొనుగోలు, అమ్మకందార్లతో కార్యాలయం నిండిపోయింది. పాత ధరలతో శుక్రవారం సాయంత్రం వరకు సుమారుగా 130 వరకు రిజిస్ట్రేషన్లు చేశారు. మార్కెట్ విలువ, స్టాంప్ డ్యూటీలు పెరుగుతుండటంతో చీరాల రిజిస్ట్రార్ కార్యాలయం ముందు, లోపల కొనుగోలుదారులు, అమ్మకందారులు, డ్యాక్యుమెంట్ రైటర్లుతో నిండిపోయింది.

మెడికల్ కళాశాలకు మృతదేహం దానం



అద్దంకి: సీపీఎం నాయకుడు గుంజి వెంకట్రావు మృతదేహాన్ని ఆయన కుమారుడు మెడికల్ కళాశాలకు దానం చేశారు. బతికి ఉన్న సమయంలో వెంకట్రావు తన కుమారునికి చెప్పిన విధంగా చేసి, తన తండ్రికి ఇచ్చిన మాట ప్రకారం మృతదేహాన్ని మెడికల్ విద్యార్థుల పరిశోధనకు ఉపయోగపడేలా అందజేసినట్లు శుక్రవారం తెలిపారు. సీపీఎం నేతలు వెంకట్రావు కుమారులకు అభినందనలు తెలియజేశారు.

విద్యా రంగానికి చంద్ర గ్రహణం

- వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గణేష్
- ఫీజు పోరులో తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొనాలని వినతి

రేపల్లె రూరల్: విద్యా రంగానికి చంద్ర గ్రహణం పట్టిందని వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గణేష్ అన్నారు. విద్యాభివృద్ధికి అహర్నిశలు శ్రమించిన ప్రభుత్వం వైఎస్సార్ సీపీ నేనని స్పష్టం చేశారు . చెరుకుపల్లి మండలం గుళ్లపల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఫీజు పోరు పోస్టర్‌లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యమని భావించిన నాటి ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అత్యధిక వ్యయం చేసి విద్యారంగంలో అనేక మార్పులు తీసుకువచ్చారని తెలిపారు.కోవిడ్ వంటి విపత్కర పరిస్థితుల్లోనే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంటు అందించి మేనమామగా నిలిచారని పేర్కొన్నారు. నేడు కూటమి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంటు బకాయిలు చెల్లించకపోవడంతో పేద విద్యార్థులు చదువుకు మధ్యలోనే దూరమయ్యే పరిస్థితులు నెలకొన్నాయని చెప్పారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు, వసతి దీవెన బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిరసనకు పిలుపునిచ్చిందని తెలిపారు. ఫిబ్రవరి 5న జిల్లా కేంద్రమైన బాపట్లలో జరిగే ఫీజు పోరులో పార్టీ ప్రతినిధులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యా సంఘాలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చదలవాడ శ్రీనివాసరావు, రేపల్లె పట్టణ, రేపల్లె రూరల్, చెరుకుపల్లి మండలాల కన్వీనర్లు కరేటి శేషగిరిరావు, మేడికొండ అనిల్‌కుమార్, దుండి వెంకట రామిరెడ్డి, నాయకులు డాక్టర్ అతిక్ పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న డాక్టర్ ఈవూరు గణేష్, పార్టీ నాయకులు

మాజీ ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేశ్వరరావుకు నివాళి

నగరం: కూటమి ప్రభుత్వ వేధింపులతో మృతి చెందిన మాజీ ఫీల్డ్ అసిస్టెంట్ పులివర్తి వెంకటేశ్వరరావు అలియాస్ యోహాను భౌతికకాయాన్ని శుక్రవారం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఈవూరు గణేష్ సందర్శించి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ రాజకీయ లబ్ధి కోసం చిరుఉద్యోగులను తొలగించడం సరైన పద్ధతి కాదని తెలిపారు. వెంకటేశ్వరరావుతో పాటు అతని భార్య నాగమణి ఉద్యోగం కూడా తొలగించడంతో మనోవేదనకు గురై గుండెపోటుతో మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారన్నారు. ఇటువంటి చర్యలు అనైతికమని ఖండించారు. ప్రభుత్వ వేధింపులతో పాటు అధికారులు కూడా ఒత్తిళ్లకు గురి చేశారని, దీంతో తీవ్ర ఆవేదన చెంది గుండెపోటుతో మృతి చెందాడని గ్రామస్తులు గణేష్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఆయన ఘటనను మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం చేసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట మండల కన్వీనర్ ఇంకొల్లు రామకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు డాక్టర్ రాజా, ఖాదర్‌వలి, కిరణ్ ఉన్నారు.

క్రీడలతోనే మానసిక ప్రశాంతత

అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్

బాపట్ల టౌన్: క్రీడలతోనే మానసిక ప్రశాంతత సాధ్యమని జిల్లా అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్ తెలిపారు. ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో శనివారం జిల్లా పోలీస్ వార్షిక స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభించారు. తొలుత బాపట్ల, రేపల్లె, చీరాల సబ్ డివిజన్ పరిధిలోని ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులు క్రీడా మైదానంలో మార్చ్ పాస్ట్ నిర్వహించారు. అడిషనల్ ఎస్పీ జెండా ఊపి, క్రీడా ప్రతిజ్ఞ చేయించారు. శాంతికి చిహ్నమైన తెలుపు కపోతాలను ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈనెల 31 నుంచి ఫిబ్రవరి 2వ తేది వరకు పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. బాపట్ల, చీరాల, రేపల్లె సబ్ డివిజన్‌ల పరిధిలోని ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగంలోని పోలీసు అధికారులు, సిబ్బందిని ఐదు బృందాలుగా విభజించి పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. పోలీస్ విధులు ఎంతో ఒత్తిడితో కూడుకుని ఉంటాయని, వాటిని అధిగమించడానికి క్రీడలు ఎంతో తోడ్పడతాయని తెలిపారు. క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని, ఫలితమేదైనా స్ఫూర్తిగా తీసుకుని ముందుకు వెళ్లాలని సూచించారు. ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తిని ప్రదర్శిస్తూ పోటీల్లో పాల్గొనాలని చెప్పారు. కార్యక్రమంలో చీరాల, బాపట్ల, సీసీఎస్ డీఎస్పీలు మోయిన్, రామాంజనేయులు, శ్రీనివాసరావు, జగదీష్ నాయక్, ఏఆర్ డీఎస్పీ పి.విజయసారథి, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



పోటీలు ప్రారంభిస్తున్న అడిషనల్ ఎస్పీ



రన్నింగ్ పోటీల్లో పోలీసులు



కబడ్డీలో తలపడుతున్న పోలీసులు

కార్యదర్శిగా నిధుల గోల్‌మాల్.. ఈఓపీఆర్డీ సస్పెన్షన్

నాదెండ్ల: గణపవరం మేజర్ పంచాయతీ కార్యాలయంలో నిధులు గోల్‌మాల్ వ్యవహారంలో ఒక ఉద్యోగి సస్పెండ్ అయ్యారు. 2019 సెప్టెంబర్ నుంచి 2022 జులై వరకు పంచాయతీ కార్యదర్శిగా సాంబ శివరావు విధులు నిర్వహించారు. అప్పట్లో ఆయన పంచాయతీ నిధులను సొంత ఖాతాకు మళ్లించుకున్నారని తెనాలి సమీపంలోని నందివెలుగు గ్రామానికి చెందిన బొప్పన సురేంద్రబాబు సమాచార హక్కు చట్టం ద్వారా తెలుసుకుని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. విచారణ అధికారి డీఎల్‌డీఓ శ్యామలాదేవి అవకతవకలను గుర్తించారు. పారిశుద్ధ్య, తాగునీటి విభాగం కార్మికులకు వేతనాలు చెల్లించే విషయంలో లోపాలను తెలుసుకున్నారు. సాంబశివరావు వ్యక్తిగత బ్యాంకు ఖాతాకు నిధులు మళ్లించుకుని, నగదు డ్రా చేసి వేతనాలు చెల్లించినట్లు నివేదికిచ్చారు. సస్పెండ్ అయిన సాంబశివరావు ప్రస్తుతం ప్రకాశం జిల్లా మద్దిపాడు ఈవోపీఆర్డీగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ విషయమై అప్పట్లో ఈవోపీఆర్డీగా పని చేసి విశ్రాంత మోషేపై కూడా చర్యలు తీసుకున్నట్లు సమాచారం.



గణపవరం పంచాయతీ కార్యాలయం

పల్లాకు తెగులుపై అప్రమత్తత అవసరం

నగరం: మినుములో పల్లాకు తెగులు నివారణకు రైతులు తగిన జాగత్తలు తీసుకోవాలని జిల్లా రైతు శిక్షణ కేంద్ర సహాయ వ్యవసాయ సంచాలకులు అక్తర్ హుస్సేన్ రైతులకు సూచించారు. మండలంలోని చినమట్లపూడిలో శుక్రవారం మినుము పంట క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. ఏరువాక శాస్త్రవేత్తలు డాక్టర్ బాలమురళీధర్ నాయక్, డాక్టర్ ఉషలు పొలాల్ని పరిశీలించి రైతులకు పలు సూచనలిచ్చారు. అక్తర్ హుస్సేన్ మాట్లాడుతూ మినుములో పల్లాకు తెగులు ఆశించిందని, నివారణకు వ్యాధి సోకిన మొక్కను తొలగించి, నాశనం చేయాలని సూచించారు. పంటపై వైరస్ వాహకాలుగా పనిచేసే తెల్లదోమ, తామర పురుగులు, పేనుబంక నివారణకు ఎసిఫేట్ 250గ్రా. లేదా తయోమిథాక్సామ్ 40గ్రా. లేదా ఏసిడమిప్రిడ్ 40గ్రా. మందును ఎకరానికి తగిన నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు.ఆకుమచ్చ, తుప్పు తెగులు నివారణకు 400గ్రా. మంకొజెబ్ మందును ఎకరానికి వాడుకోవాలని తెలిపారు. ఎక్కడైనా బూడిద తెగులు ఆశిస్తే మైక్లోబుటానిల్ 150గ్రా. మందును ఎకరానికి పిచికారీ చేయాలని కోరారు.కార్యక్రమంలో ఏవో రమేష్‌బాబు, ఏఈవో నాగశ్రీనివాస్, వీఏఏలు పాల్గొన్నారు.



క్షేత్ర పర్యటనలో పాల్గొన్న వ్యవసాయాధికారులు

డ్వాక్రా రుణాల గోల్‌మాల్ కేసులో నిందితురాలి అరెస్టు

రేపల్లె రూరల్: డ్వాక్రా రుణాలను పక్కదారి పట్టించిన కేసులో నిందితురాలిని అరెస్ట్ చేసినట్లు పట్టణ సీఐ మల్లికార్జునరావు తెలిపారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థలో పనిచేస్తున్న పలువురు నకిలీ డ్వాక్రా గ్రూపులను సృష్టించి బ్యాంక్ నుంచి రుణాలు పొంది స్వాహా చేశారన్నారు. ఈ ఘటనపై మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకట నారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఇప్పటికే ఒకరిని అరెస్ట్ చేశామన్నారు. విచారణలో భాగంగా 14వ వార్డుకు చెందిన కొమ్మల సువార్తకుమారిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం 15 రోజులు రిమాండ్ విధించిందని తెలిపారు.

మహాశివరాత్రికి సర్వం సిద్ధం చేయండి

ఆర్డీఓ మురళీకృష్ణ

గురజాల: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని దైద గ్రామంలోని అమరలింగేశ్వర స్వామి దేవస్థానంలో అన్ని ఏర్పాట్లు చేయాలని గురజాల ఆర్డీఓ మురళీకృష్ణ అధికారులను ఆదేశించారు. తన కార్యాలయంలో శుక్రవారం పలు శాఖల అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ నెల 26న మహా శివరాత్రి సందర్భంగా అమరలింగేశ్వరస్వామి దేవస్థానానికి భక్తులు భారీగా పోటెత్తుతారని చెప్పారు. ఈ ఏడాది కూడా ఎంతమంది భక్తులు వస్తారో అంచనా వేసి, ముందస్తు జాగ్రత్త చర్యలతో పాటు సౌకర్యాలన్నీ కల్పించాలని సూచించారు. దేవదాయశాఖ అధికారులు క్యూలైన్లు, ఘాట్ శుభ్రత చేపట్టి, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని చెప్పారు. ఈ సమావేశంలో అటవీ, పంచాయతీ, పోలీస్, ఆర్టీసీ, ఎక్సైజ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ మురళీకృష్ణ

పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయకపోవడం దుర్మార్గం

- నరసరావుపేట చేరుకున్న పోలవరం నిర్వాసితుల పతాక యాత్ర జాతా
- బహిరంగ సభలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దడాల సుబ్బారావు

నరసరావుపేట: 19 ఏళ్లుగా పోలవరం ప్రాజెక్టు, నిర్వాసితుల ప్రయోజనాలను పట్టించుకోకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజకీయం చేస్తున్నాయని, నిర్వాసితులకు మొక్కుబడిగా న్యాయం చేసి వారికి ఎటువంటి మౌలిక సదుపాయాలు కల్పించకుండా ప్రాజెక్టు పనులు మొదలు పెట్టడం నాటి, నేటి ప్రభుత్వాలకు ఏమాత్రం తగదని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దడాల సుబ్బారావు అన్నారు. నెల్లూరు జిల్లాలో జరగనున్న 27వ రాష్ట్ర మహాసభల సందర్భంగా పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయాలన్న ప్రధాన ఎజెండాతో ఈనెల 28న పోలవరం నుంచి నెల్లూరు బయలుదేరిన పోలవరం నిర్వాసితుల పతాక యాత్ర జాతా శుక్రవారం సాయంత్రానికి పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట చేరుకుంది. పల్నాడు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రచార జాతాకు పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య, గుంటూరు విజయ్‌కుమార్ ఘన స్వాగతం పలికారు. ర్యాలీగా వినుకొండ రోడ్డులోని వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభకు చేరుకున్నారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యురాలు డి.శివకుమారి అధ్యక్షతన నిర్వహించిన సభలో సుబ్బారావు మాట్లాడుతూ పోలవరం నిర్వాసితులకు పూర్తిస్థాయిలో పునరావాసం కల్పించి ఆ తరువాత పోలవరం ప్రాజెక్టు పనులు వేగవంతం చేయాలని, నాణ్యత ప్రమాణాలకు ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏడాదికి మూడు దఫాలుగా వస్తున్న వర్షాలకు వచ్చే వరదలకు నిర్వాసితులు రక్షణ పొందేందుకు కొండలు, గుట్టలను ఆశ్రయిస్తున్నారని అన్నారు. ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు హెలికాప్టర్లలో చూసి వెళ్లడం కాదని ఒక్కరోజైనా వారితో గడిపితే నిర్వాసితులైన గిరిజనుల బాధలు తెలుస్తాయని అన్నారు. సీనియర్ నాయకులు గద్దె చలమయ్య, మహిళా సంఘం నాయకులు ఉమశ్రీ, రజిని, మల్లీశ్వరి, దుర్గాబాయ్, నాగమ్మ భాయ్, నాయకులు లక్ష్మీశ్వరరెడ్డి, హనుమంత రెడ్డి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



పతాక యాత్రలో పాల్గొన్న పార్టీ నాయకులు

ధ్రువపత్రాల జారీపై అవగాహన అవసరం

వైటల్ స్టాటిస్టిక్స్ రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

తెనాలి అర్బన్: వాట్సాప్‌లో జనన, మరణాల ధ్రువపత్రాలను జారీ చేసే విధానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని వైటల్ స్టాటిస్టిక్స్ రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో జనన, మరణ ధ్రువపత్రాలు జారీ చేసే రిజిస్ట్రార్‌లు, కంప్యూటర్ ఆపరేటర్లతో శుక్రవారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తెనాలిలో ప్రయోగాత్మకంగా వీటిని జారీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని చెప్పారు. మొదట తెనాలిలో వీటిని జారీ చేసి లోటుపాట్లు పరిశీలించడం జరుగుతుందన్నారు. పైలెట్ ప్రాజెక్టు కింద చేపట్టిన ఈ కార్యక్రమం విజయవంతమైతే రాష్ట్ర మొత్తం అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన యాప్ ద్వారా ప్రస్తుతం వీటిని జారీ చేయడం జరుగుతుందన్నారు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన యాప్ ద్వారా తెనాలిలో వీటిని జారీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. డీఎంహెచ్‌ఓ కార్యాలయ స్టాటిస్టిక్స్ ఆఫీసర్ పద్మజ, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, ఆరోగ్యాధికారిణి డాక్టర్ హెలెన్ నిర్మల, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

బోల్తాపడిన కంటైనర్ లారీ



బోల్తాపడిన కంటైనర్

నకరికల్లు: విపరీతంగా కమ్ముకున్న పొగ మంచుకు డ్రైవర్ నిద్రమత్తు తోడవడంతో భారీ కంటైనర్ అదుపు తప్పి బోల్తాపడింది. సమీపంలో ప్రజలెవరూ లేకపోవడంతో ప్రాణపాయం తప్పింది. ఈ ఘటన స్థానిక పోలీస్ స్టేషన్ ఎదుట అద్దంకి–నార్కట్‌పల్లి రాష్ట్ర రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున జరిగింది. వివరాల మేరకు.. చెన్నై వైపు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కంటైనర్ ఉదయం 5 గంటల సమయంలో పోలీస్ స్టేషన్‌కు ఎదురుగా రహదారి మలుపు వద్ద అదుపు తప్పింది. హైవే గోడను వేగంగా ఢీకొట్టింది. దీంతో హైవేపై నుంచి సర్వీస్ రోడ్డులో భారీ శబ్దంతో బోల్తాపడింది. ప్రమాదంతో సమీప నివాసితులు ఉలిక్కిపడ్డారు. రోడ్డుపై జనసంచారం లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఎస్ఐ చల్లా సురేష్ క్రేన్‌ల ద్వారా లారీని పక్కకు తీసి, రాకపోకలను క్రమబద్ధీకరించారు. ప్రమాదానికి డ్రైవర్ నిద్రమత్తు కారణంగా భావిస్తున్నారు.

శివయ్య మాస్టారుకు విద్యాజ్యోతి అవార్డు

కారెంపూడి: రాజమండ్రి కేంద్రంగా వెలువడుతున్న విద్యా జ్యోతి ప్రతినిధులు కారెంపూడికి చెందిన తమ్మిశెట్టి శివయ్య మాస్టారుకు శుక్రవారం రాజమండ్రిలో అవార్డు ప్రదానం చేశారు. గుంటూరులోని సెయింట్ ఇగ్నేషియస్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ ప్రిన్సిపల్ శివయ్యను విద్యాజ్యోతి– 2025 అవార్డుకు ఎంపిక చేసినట్లు పత్రిక స్పెషల్ ఎడిటర్ జె.రమేష్ రాజా తెలిపారు.

నిలిపి ఉన్న కారులో నగదు చోరీ



కారు వద్ద వివరాలు వెల్లడిస్తున్న బాధితుడు ప్రకాశరావు

చిలకలూరిపేట: ఆగి ఉన్న కారు అద్దం పగలగొట్టి, నగదు దొంగతనానికి పాల్పడిన ఘటన పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. బాధితుడు నకిరికల్లుకు చెందిన చందోలు ప్రకాశరావు వివరాల మేరకు.. మండలంలోని యడవల్లి గ్రామం వద్ద ప్రకాశరావు భూమి కొనుగోలు చేశాడు. రిజిస్ట్రేషన్ సందర్భంగా సాయంత్రం 4 గంటలకు సంతకాలు పెట్టేందుకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోనికి వెళ్లాడు. వెళ్లే ముందు రూ.86 వేలు నగదు ఉన్న బ్యాగును కారులో పెట్టి లాక్ చేశాడు. ఇది గమనించిన దొంగలు చాకచక్యంగా కారు డోరు అద్దం శబ్దం కాకుండా కెమికల్స్ ఉపయోగించి తొలగించి దొంగతనానికి పాల్పడ్డారు. నగదు తీసుకుని బ్యాగును ఎన్ఆర్‌టీ సెంటర్‌లో ఓ హోటల్ ఎదురుగా పడేశారు. బ్యాగులో చెక్ బుక్, ఫోన్ నంబర్ ఉండటంతో.. గమనించిన స్థానికులు ప్రకాశరావుకు ఫోన్ చేసి చెప్పారు. కార్యాలయానికి చేరుకొని బాధితుడికి బ్యాగ్ అప్పగించారు. ప్రకాశరావు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు నమోదు చేసుకున్నారు.

బాపట్ల జిల్లా గిత్తలకు ప్రథమ స్థానం

హోరాహోరీగా బాపట్ల, ప్రకాశం జిల్లాల ఎడ్ల బలప్రదర్శన

రెంటచింతల: స్థానిక కానుకమాత చర్చి వజ్రోత్సవ తిరునాళ్ల మహోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక సెయింట్ జోసఫ్ హైస్కూల్ క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శనలో బాపట్ల, ప్రకాశం జిల్లాల గిత్తలు ప్రథమ స్థానం కోసం హోరాహోరీగా పోరాడాయి. న్యూ కేటగిరి విభాగంలో జరిగిన ఈ ప్రదర్శనలో బాపట్ల జిల్లా వేటపాలెం గ్రామానికి చెందిన అత్తోట శిరీషాచౌదరి, శివకృష్ణ చౌదరి గిత్తలు 3,900.9 అడుగుల దూరం లాగి ప్రథమ బహుమతి కైవసం చేసుకున్నాయి. ప్రకాశం జిల్లా సంతమాగులూరు గ్రామానికి చెందిన వజ్రాల తేజశ్రీరెడ్డి గిత్తలు 3,900 అడుగుల దూరం లాగి రెండవ బహుమతి దక్కించుకున్నాయి. ప్రకాశం జిల్లా ఉప్పమాగులూరు గ్రామానికి చెందిన టి.రవిశంకర్‌రెడ్డి గిత్తలు 3,300 అడుగుల దూరంలాగి మూడో బహుమతి కైవసం చేసుకున్నాయి. తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట జిల్లా కోదాడ గ్రామానికి చెందిన డాక్టర్ హుస్సేన్, పల్నాడు జిల్లా రెంటచింతల మండలం రెంటాల గ్రామానికి చెందిన పి. సూర్య అశ్విక్ యాదవ్ కంబైడ్ గిత్తలు 3,287.8 అడుగుల దూరం లాగి 4వ బహుమతి దక్కించుకున్నాయి. కృష్ణా జిల్లా తెంపల్లి గ్రామానికి చెందిన కె.శ్రీనివాసయాదవ్ గిత్తలు 3,135 అడుగుల దూరం లాగి 5వ బహుమతి గెలుచుకున్నాయి. పల్నాడు జిల్లా దొండపాడు గ్రామానికి చెందిన యర్రం రాజశేఖర్, యశ్వంత్ గిత్తలు 2,889.6 అడుగులు లాగి 6వ బహుమతి దక్కించుకున్నాయి. ప్రకాశం జిల్లా మద్దిపేముల గ్రామానికి చెందిన సిద్ది మల్లేశ్వరి గిత్తలు 2,840 అడుగులతో 7వ బహుమతి కైవసం చేసుకున్నాయి. గుంటూరు జిల్లా పాలడుగు గ్రామానికి చెందిన వి.శ్రీనివాసరావు, ఎస్.పవన్‌కుమార్ గిత్తలు 2,707 అడుగులు లాగి 8వ బహుమతి దక్కించుకున్నాయి. ప్రకాశం జిల్లా పొట్లపాడు గ్రామానికి చెందిన నుసుం బయ్యపురెడ్డి గిత్తలు 2,700 అడుగులు లాగి 9వ బహుమతి గెలుచుకున్నాయి. ఈ బలప్రదర్శనలో మొత్తం 10 జతలు పాల్గొన్నాయి. మిగిలిన ఒక జతకు కూడ రూ.3 వేలు అందజేసినట్లు కమిటీ సభ్యులు వైఎల్ మర్రెడ్డి, ఆదూరి ఇన్నారెడ్డి, అల్లం ప్రతాప్‌రెడ్డి, గొంటు సుమంత్‌రెడ్డి, ఓ.ఇన్నారెడ్డి, బి.రామకృష్ణ, మూలి రాజారెడ్డి, ఎం.చిన్న శౌరెడ్డి, కె.జోసఫ్‌రెడ్డి, గాదె కస్పారెడ్డి, గాలి ప్రకాష్‌రెడ్డి, వెన్నా కోటిరెడ్డి, ఏరువ జోజిరెడ్డి తెలిపారు. న్యాయనిర్ణేతలుగా రాధాకృష్ణ, పెద్దిరెడ్డి సుబ్బారెడ్డి, శ్రీనివాస్ వ్యవహరించారు. శనివారం జూనియర్ విభాగంలో బలప్రదర్శన ఉంటుందని తెలిపారు.



ప్రథమ బహుమతి కైవసం చేసుకున్న బాపట్ల జిల్లా గిత్తల ప్రదర్శన



ద్వితీయ బహుమతి కైవసం చేసుకున్న ప్రకాశం జిల్లా గిత్తలు ప్రదర్శన